# మనిషీ - మానవత్వమూ!

బస్సంతా క్రిక్కిరిసి తొడ తొక్కిడిగా ఉంది. ఆ వూరి బస్ స్టాండులో ఆ బస్సు ఆగీ ఆగడంతోనే మళ్ళీ మోపెడు జనం ఎగబడ్డారు. జీర్ణశక్తి ఎక్కువ జ్ఞాపకశక్తి తక్కువ అన్నట్టు - ఆ బస్‌లో ఎక్కే జనం ఎక్కువ దిగే జనం తక్కువ. రెండు చేతులతోనూ జనాన్ని బలంగా వెనక్కి నెడుతున్నాడు బస్సు కండక్టరు. అయినా జనం గట్లులేని ప్రవాహంలా ఆగడంలేదు. దిగే ప్రయాణీకులు నలుగురూ దిగగానే, ఒకే ఒక గౌరవనీయులైన రాజకీయనాయకుణ్ణి ఎక్కించి, మిగతా వాళ్లకు మొండి చేయి చూపెట్టి బెల్ కొట్టాడు కండక్టరు. బస్సు సాగారింది.

"సార్! మరో బస్సులో రాకపోయారండీ! ఇందులో నిలబడ డానిక్కూడా చోటులేదు" అన్నాడు కండక్టరు.

'ఏంచేసేది? అర్జంటుగా బందరు వెళ్ళాలి, ఈ బస్సు తప్పితే మరి రెండు గంటల దాకా పడిగాపులు కాయాలి. అవతల ఆర్. డి. వో. గారితో పని ఉంది. మా సమితిక్రింద వికలాంగుల శరణాలయం పెట్టాంగా. ఒచ్చే నెల మొదటి తేదీన వారిచేత దానికి ప్రారంభోత్సవం చేయించా లని ప్రయత్నం'' అన్నాడు సమితి ప్రెసిడెంటు అద్భుతరావుగారు పేటంచు ఖద్దరు పైపంచను సర్దుకుంటూ.

"మీరొచ్చాక సమితిపాలన మూడు పువ్వులూ ఆరుకాయలుగా ఉందండి. మీకు బీదలపట్ల, వికలాంగుల పట్ల వున్న దయాదాక్షిణ్యాలు

పదికాలాలపాటు కొనియాడదగినది." అన్నాడు కండక్టరు టిక్కెట్టు కొడుతూ.

సమితి ప్రెసిడెంటు అద్భుతరావుగారు బస్సు లోపల పొడుగాటి చువ్వ పట్టుకొని బస్సునంతా ఒక్కసారి కలియజూశాడు – తనకి మర్యాదగా, గౌరవసూచకంగా సీటు యిచ్చేవా డెవడైనా ఉన్నాడేమోనని. తన హోదాకీ, సంపాదనకూ, రాజకీయపు టంతస్థుకూ, పలుకుబడికీ, సాంఘికమైన పెరుగుదలకూ – అట్లా బస్సులో చువ్వపట్టుకుని వ్రేళ్లాడటం ఎంతో నామూషీగా, చిన్నతనంగా, న్యూనతగా ఫీలయ్యాడు అద్భుతరావుగారు. తనని ప్రజానాయకునిగా, పరిపాలనా దక్షునిగా గుర్తించి సీటులోంచి మర్యాదగా లేచి, తనకి ఆప్యాయంగా సీటు యిచ్చేవాళ్లెవరూ కనబడకపోయేసరికి ఆ నాయకుడు నీటిలోపడ్డ ఉప్పుగడ్డలాగా నిరుత్సాహపడ్డాడు. గాలితీవ్రతకు చెట్టునున్న చచ్చుకాయలాగ బస్సు వూపుకు అటూ ఇటూ వూగసాగాడు అద్భుతరావుగారు.

"ఏయ్! కండక్టర్! కూర్చోటానికి ఏదైనా సీటు చూడవోయ్!" అన్నాడు అద్భుతరావుగారు అధికార దర్జాతో.

"మీకు ముందే మనవిచేశానుగా, సార్, పెళ్లిళ్ల సీజను. బస్సులో ఇసుక వేస్తే రాలకుండా వుంటూన్నది. ఇది ప్రజాసామ్యం గదా! ఎవర్ని లేపుతాం సీటులోంచి. ఏ పిల్లవాణ్ణి లేపినా "ప్రాథమిక హక్కుల్ని" గురించి మాట్లాడుతాడు అన్నాడు కడంక్టరు ట్రిప్పు షీటుమీద కూడికలు కూడుకుంటూ.

రాజకీయాల్లోకి దిగిన పదేళ్ళనుంచీ కోడిమాంసంతో పెంచిన రెండు వందల పౌన్ల శరీరాన్ని అట్లా బస్సు కుదుపులకు తట్టుకొనేట్లు నిలబెట్టాలంటే అద్భుతరావుగారికి అలిమిగాకుండా ఉంది. కాళ్లు పీక్కుపోతున్నాయి. వొళ్లంతా కదలబారుతున్నది. ఎత్తు జాస్తి కావటాన మెడ జీవాలు క్రుంగిపోతున్నాయి. ఆయన నిలబడ్డచోటు ప్రక్కన ఓసీటులో ఓ బిచ్చగాడిలాంటి బీదవాడు కూర్చున్నాడు. నూనెలేనిజుత్తు రాగిరంగుకు తిరిగి రేగికంపలాగ ఉంది. ఓ మాదిరిగా గడ్డం పెంచుకొని ఉన్నాడు.

డబ్బుల్లేకనే గడ్డాన్ని అట్లా పెంచాల్సి వచ్చిందని ఇట్టే తెలిసిపోతున్నది. చినిగిన లాల్చీ, మురికిపట్టిన లుంగీ. టిక్కెట్టు కొన్నప్పుడు కూర్చునే హక్కూ, అధికారమూ ఎందుకు లేవన్నట్టుగా ధీమాగా కూర్చుని ఉన్నాడు. ఆకులు రాల్చిన సర్వేచెట్టులా సన్నని శరీరం.

ఈ బుక్కాఫకీరుగాణ్ణి ఆసీటులోంచి అధికార హోదాతో లేపి తనెందుకు ఆ సీటులో కూర్చోరాదు - అన్న ఆలోచన సమితి ప్రెసిడెంటు అద్భుతరావుగారిలో అద్భుతంగా మెరిసింది.

"ఏయ్! ఎవరు నువ్వు!"

జవాబు లేదు.

"ఎక్కడకు వెళుతున్నావ్"?

మౌనంగా ఉన్నాడు.

నెత్తిమీద రూపాయి పెడితే అర్ధరూపాయికూడా అమ్ముడుపోని ఆ బుడబుక్కలవాడు సీటులో కూర్చోవడమూ - తనలాంటి పెద్దమనిషీ, హోదాగల వ్యక్తీ, పద్ధెనిమిది పంచాయితీలు గల సమితికి అధ్యక్షుడూ, రాజకీయ నాయకుడూ, పలుకుబడిగలవాడూ నిలబడడం ఏదో అపచారంగా, అన్యాయంగా, అక్రమంగా కనబడింది. ఒక ఎత్తు ఎత్తాడు.

"ఏయ్! కండక్టర్! వీణ్ణి ఇక్కణ్ణుంచి లేపు. సారాకంపు కొడుతూన్నది. తాగి వచ్చినట్టున్నాడు. ఆ కంపు భరించలేకుండా ఉన్నాం' అన్నాడు అద్భుతరావుగారు ఖద్దరు పంచెను ముక్కు దగ్గరకు లాక్కుంటూ.

ఆ సీటులో కూర్చున్నవాడు అదిరిపడి అద్భుతరావుగారికేసి ఆశ్చర్యాతి ఆశ్చర్యంగా చూశాడు. కాని నోరు కదపలేదు.

బస్సులోని జనమంతా వాళ్ళకేసి కళ్ళు అప్పగించి చూశారు.

"మర్యాదగా సీటులోంచి లేస్తావా, పోలీసులకు పట్టించమంటావా? గాంధీజీ శతజయంతి సంవత్సరంలో ఇట్లాంటి ఘోరాల్ని ఏ మానవుడూ సహించలేడు." అన్నాడు అద్భుతరావుగారు గర్జిస్తూ.

బస్సు కండక్టరు చోద్యంగా చూస్తూ నిలబడ్డాడు.

ఆ సీటులో కూర్చున్న బక్కవాడు నదురూ బెదురూ లేకుండానే నిమ్మకు నీరెత్తినట్టు కూర్చున్నాడు.

ఒంటికి కొత్త కారం పులిమినట్లయింది అద్భుతరావుగారికి. ఆయనలో కోపోద్రేకాలు కొండమీదకు ఎగబ్రాకుతున్నాయి.

"నేనెవర్నో తెలుసా?" కుందేలు పిల్ల ముందు సింహం గర్జించినట్టు గర్జించాడు అద్భుతరావుగారు.

అప్పటికీ బిచ్చగాని మోస్తరుగా వున్న ఆ బీదవాడికి చీమ కుట్టినట్టుగా కూడా లేకపోయింది.

తన హోదా, రాజకీయ ఔన్నత్యమూ, పలుకుబడీ, అధికార దర్పమూ, షావుకారు దనమూ – వెధవది ఓ బిచ్చగాణ్ణి బస్సులో సీటులోంచి తొలగించడానికి అక్కరకు రాకుండా పోయాయ్ అన్న ఉక్రోషం అద్భుతరావుగారిలో ఉత్తుంగ హిమాద్రి శిఖరంవలె లేచింది. కాని కాళ్లు మట్టుకు నేలమీదనే వుండక తప్పలేదు. ఎనభై మంది జనం వున్న ఆ బస్సులో ఓ అల్పుని దగ్గర తన మాట చెల్లుబడికాకపోవడం ఒక గొప్ప అవమానంగా భావించాడు. వీణ్ణి ఏంచేయాలా అని ఆయన తీవ్రంగా ఆలోచిస్తూండగానే బస్సు ఆగింది.

"ఈ సీటు కోసమేగా బాబూ మీరు నామీద కత్తి దూసింది. కూర్చోండి. నేను దిగే వూరు వచ్చింది." అంటూ బిచ్చగానిలావున్న ఆ బీదవాడు సీటు క్రిందకు వొంగి రెండు కొయ్యకర్రలను బయటకు తీశాడు. ఆ కర్రల్ని చంకలకు తగిలించుకుని బరువుగా, భారంగా లేచాడు. మోకాళ్ళ వరకూ రెండు కాళ్ళూ లేని ఆ కుంటివాడు బస్సు దిగేందుకు కండక్టరు సహాయం చేశాడు.

సమితి ప్రెసిడెంటు అద్భుతరావుగారు ఆశ్చర్యపడుతూ చూస్తూ అలానే ఉండిపోయాడు.

అంతలో ఆయన చెంతనే నిలబడ్డ మరో వ్యక్తి ఆ ఖాళీ సీటును మాటా పలుకు లేకుండా ఆక్రమించాడు.

(జ్యోతి వారపత్రిక)

—o—